
సాక్షి ప్రకాశం
మంగళవారం | 21 | నవంబర్ | 2023




● శివం..శివం

కార్తీకమాసంలో మొదటి సోమవారం కావడంతో శైవక్షేత్రాలన్నీ భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రమైన భైరవకోన భక్తులతో రద్దీగా మారింది. త్రిముఖదుర్గాదేవి, నగరేశ్వర ఆలయాల వద్ద భారీ సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సీఎస్ పురం (పామూరు)

న్యూస్‌రీల్

నాబార్డు నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన నిధులు (ఆర్ఐడీఎఫ్–నాబార్డు)తో నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రాన్స్ 2022–28కు వివిధ దశల్లో ఆర్ఐడీఎఫ్ ద్వారా మంజూరైన పనులను వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి సుమారు రూ.750 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. పనులన్నీ నిర్దిష్ట వ్యవధిలో తప్పనిసరిగా పూర్తి చేసి బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి ప్రాజెక్టు కంప్లీట్ రిపోర్టును నాబార్డుకు వెంటనే పంపాలన్నారు. అందులో భాగంగా మార్కాపురం మెడికల్ కాలేజీ, దోర్నాలలోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి అగ్రిల్యాబ్స్, నాడు–నేడు కింద పాఠశాలల భవనాలు, పశుసంవర్ధక శాఖకు సంబంధించి వెటర్నరీ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ద్వారా జరుగుతున్న పనులపై ఆరా తీశారు. సమావేశంలో నాబార్డు డీడీఎం రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ నేడు జిల్లాకు రాక

ఒంగోలు అర్బన్: జిల్లాలో జరుగుతున్న ఎలక్టోరల్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ నేడు జిల్లాకు వస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. జిల్లాలో ప్రక్రియపై ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


వెబ్‌సైట్‌లో ఎన్ఎంఎంఎస్ హాల్ టికెట్లు

ఒంగోలు సెంట్రల్: 2023–24 విద్యాసంవత్సరానికి జరగనున్న జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి తెలిపారు. డిసెంబర్ 3వ తేదీ ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూ–డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్‌పై వారి పాఠశాల విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసి వారికి అందజేయాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు.

23లోగా బిడ్లు దాఖలు చేయాలి

ఒంగోలు సిటీ: జిల్లాలోని 2,903 అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందించే పదార్థాలను నిర్ణీత కొలతల ప్రకారం సరఫరా చేసేందుకు జిల్లా కొనుగోలు కమిటీ ఒంగోలు వారు షార్ట్ టెండర్లు కోరుతున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మాధురి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు బిడ్లు దాఖలు చేయాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు

ఒంగోలు మెట్రో: గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నగరంలోని డ్వాక్రా బజారులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారం రోజులు నిర్వహించిన పోటీల్లో విజేతలకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ గ్రంథాలయ పాలకురాలు టి.గోవిందమ్మ కృతజ్ఞతలు తెలిపారు

ఆర్థిక సుస్థిరత

కడలి అలలపై గంగపుత్రుల సాహసయానం.. వలల మాటున పొట్టకూటి కోసం నిత్యం తిప్పలే.. రోజుల తరబడి ప్రయాణం..
బతుకునావ తీరం చేరే వరకు క్షణక్షణం ఉత్కంఠే.. ఇంతచేసినా బతుకు ఒడ్డున పడుతుందన్న భరోసా లేదు. గత ప్రభుత్వం వీరిని నిర్లక్ష్యం చేసింది. పాదయాత్రలో మత్స్యకారుల దయనీయమైన జీవితాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కొత్త వెలుగులు తీసుకొచ్చారు. వారి జీవితాలను మార్చేలా పలు సంక్షేమ పథకాలను అమలు చేశారు. మత్స్యపరిశ్రమ రూపురేఖలు మార్చేశారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...



- మత్స్యకారులకు అండగా ప్రభుత్వం
- గంగపుత్రులను నిర్లక్ష్యం చేసిన టీడీపీ ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ బాట పట్టించిన జగన్‌మోహన్‌రెడ్డి
- పథకాలను సద్వినియోగం చేసుకుంటూ జీవనం
- నేడు మత్స్యకార దినోత్సవం

ఒంగోలు సెంట్రల్: మత్స్యకారులు తమ కులవృత్తినే దైవంగా భావించి కడలిపై బతుకు సమరం చేస్తుంటారు. వేట తప్ప మరే పని తెలియని గంగపుత్రులు తమ భార్య, పిల్లలను ఇంటి వద్దనే వదిలేసి నెలల తరబడి నడిసంద్రాన్నే నమ్ముకుని ముందుకు సాగుతుంటారు. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలను స్పృశిస్తే వలల మాటున మత్స్యకారులు పడుతున్న అవస్థలు సాక్షాత్కరిస్తుంటాయి. గత టీడీపీ ప్రభుత్వం వీరిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. బతుకుపై ఆశలు వదిలేసుకుని సుదూర ప్రాంతాలకు వలసబాట పట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి కష్టాలు తొలగిపోయాయి. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వారి బతుకుల్లో నవోదయాన్నిచ్చాయి. వేటకు సంబంధించి వివిధ రకాల పనిముట్లపై రాయితీలు, డీజిల్ సబ్సిడీ, నిషేధ సమయంలో ఇస్తున్న భృతిని రూ.10 వేలకు పెంచింది. అలాగే హార్బర్లు, పోర్టుల నిర్మాణం చేపట్టింది. ఇకపై మత్స్యకారులు ఎక్కడికీ వలస పోవాల్సిన పనిలేకుండా సొంత ఊర్లోనే లాభదాయకమైన వేట సాగించేందుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలోనే తాజాగా చేపల వేటను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి 75 శాతం రాయితీతో బోట్లు, వలలు మంజూరు చేస్తోంది. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. దీంతో స్వస్థలాల్లో వేట వేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా ఉంటున్నారు.

జిల్లాలో 50 కి.మీ మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. సింగరాయకొండ, కొత్తపట్నం, ఒంగోలు, నాగులుప్పలపాడు, టంగుటూరు మండలాల్లో తీరప్రాంతం ఉంది. మత్స్యకార కుటుంబాలు 7,500, జనాభా 38,000 మంది ఉన్నారు. అందులో 11,200 మంది వేటను ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అందులో కర్ర తెప్పలు 385, మోటారు పడవలు 1,087 ఉన్నాయి. చేపల వేట నిషేధ కాలంలో (ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు) ప్రభుత్వం ఇచ్చే భృతి ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ.42.882 కోట్లు అందించారు.

జిల్లాలో తీరప్రాతం	50 కి.మీ
మండలాలు	5
మత్స్యకార కుటుంబాలు	7,500
మత్స్యకార జనాభా	38,000
చేపల వృత్తిలో ఉన్నవారు	11,200

డీజిల్‌పై రాయితీ పెంపు...

డీజిల్ సబ్సిడీని 2019–20 నుంచి రూ.6.03 నుంచి రూ.9కి పెంచగా, జిల్లాలో 1,045 మంది మత్స్యకారులు వినియోగించుకుంటున్నారు. అలాగే ప్రమాదవశాత్తూ మృతి చెందితే ఇచ్చే పరిహారాన్ని ప్రభుత్వం భారీగా పెంచింది. గతంలో రూ.5 లక్షల ఇచ్చే పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచింది. అలాగే 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ మంజూరు చేస్తున్నారు. జిల్లాలో 4,600 మంది పెన్షన్ అందుకుంటున్నారు.



మత్స్యకారులకు వాహనాలు అందిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు (ఫైల్)

వేట విరామ సమయంలో ఊపిరి పోశారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేట విరామ సమయంలో భృతిని నాలుగు వేల నుంచి పది వేల రూపాయలకు పెంచి మత్స్యకార కుటుంబాలకు ఊపిరి పోశారు. సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు.

– **అంజయ్య**, పెద్దపట్టపుపాలెం, మడనూరు

ప్రమాద ఇన్సూరెన్స్‌తో భరోసా రెట్టింపు



మత్స్యకారులకు ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందితే వారి కుటుంబాలకు గతంలో ఉండే ఇన్సూరెన్స్‌లు డబుల్ చేశారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ప్రకటించడంతో రెట్టింపు భరోసా లభించింది. డీజిల్‌కు సైతం సబ్సిడీ పెంచడం మత్స్యకారులకు మరింత కలిసివచ్చినట్లయింది.

– **వాయిల శ్రీను**, చిన్నపట్టపుపాలెం, మడనూరు

పూర్తి సహకారం



సముద్రంపై చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న సంప్రదాయ మత్స్యకారులను ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలతో ఆదుకుంటోంది. రాయితీలపై అనేక సామగ్రి అందజేస్తోంది. మత్స్యకారుల భరోసా కింద రూ.10 వేలను సకాలంలో వారి ఖాతాల్లో జమ చేస్తోంది. అలాగే ప్రమాద బీమా సైతం రెట్టింపు చేసింది. చేపల ఉత్పత్తిని పెంచుకునేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తోంది. చేపల మార్కెటింగ్‌కు శిక్షణ ఇచ్చి ఫిష్ ఆంధ్ర పథకం తీసుకొచ్చి ఫిషర్‌మెన్‌లకు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాం.

– **ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి**, జేడీ, మత్స్యశాఖ, ఒంగోలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

రేపు సామాజిక సాధికార యాత్ర

- ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- కులవృత్తుల వారీగా శకటాలు ఏర్పాటు
- పాల్గొననున్న మంత్రులు ఆదిమూలపు, మేరుగు, రజిని, కృష్ణయ్య
- పోస్టర్లు ఆవిష్కరించి వివరాలు వెల్లడించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను ఈ నెల 22వ తేదీ భారీ ఎత్తున ఒంగోలు నగరంలో నిర్వహించనున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ యాత్రలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు పాల్గొంటారని చెప్పారు. సోమవారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను బాలినేని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ఈ యాత్రలో వివరిస్తామన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో వారి జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయని ప్రజలకు తెలియజెప్పేందుకు ఈ యాత్రను చేపట్టినట్లు చెప్పారు. బస్సుయాత్రలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున, వైద్యారోగ్య శాఖామంత్రి విడదల రజిని, బీసీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, తదితర నాయకులు పాల్గొంటారని తెలిపారు. అందర్నీ ఆకట్టుకునే విధంగా ఈ యాత్రల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల వృత్తులకు సంబంధించి శకటాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో స్థానిక కర్నూలు రోడ్డు బైపాస్ నుంచి బాపూజీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ, అనంతరం పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నరేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కుల, మత, వర్గ వివక్ష లేకుండా అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. బీసీలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. బీసీలకు చెందిన అన్ని కులాలు వైఎస్సార్ సీపీకి పూర్తిస్థాయి మద్దతిస్తున్నాయని చెప్పారు. జిల్లాలోని వివిధ అనుబంధ సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సామాజిక సాధికార యాత్రకు సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి బాలినేని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర నాయకుడు కఠారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు పాల్గొన్నారు.

ఊసరవెల్లిలా ఎల్లో పార్టీ, ఎల్లో మీడియా

- నాపై రోజుకో అసత్య కథనం
- ఇది ఎంతమాత్రం కరెక్టు కాదు
- దామచర్ల జనార్దన్ వాస్తవాలు తెలుసుకోవాలి
- ఏదైనా సమస్య ఉంటే అడగండి
- భూ కుంభకోణాల దోషులను ఎప్పటికైనా శిక్షిస్తాం
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సిటీ: ఎల్లో పార్టీ, ఎల్లో మీడియా ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ రోజుకో అసత్య కథనాలు ప్రచారం చేస్తూ ప్రజల విశ్వాసం కోల్పోతున్నాయని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక బాలినేని నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఒంగోలు సీటును జనసేనకు కేటాయిస్తారనే భయంతో తన ఉనికిని చాటుకునేందుకు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. భూ ఆక్రమణలకు సంబంధించి మేయర్ జీపీఏ చేయించుకున్నారని విలేకరులు అడగ్గా.. గతంలో మీడియా మిత్రులు ఇదే అంశాన్ని అడిగారని, అప్పటి వరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదు కదా..తాను మీడియాకి చెప్పిన తర్వాత రైతులు వెళ్లి ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదు ఆధారంగా వారు వెరిఫై చేసుకున్నారని, జన్యూన్ కాబట్టి రైతులను ఇబ్బంది పెట్టడం జరగలేదని తెలిపారు. పొలం సమస్య వచ్చినపుడు దానికి సంబంధించి రైతులు డాక్యుమెంట్ చూపించాలన్నారు. కంప్లైంట్ ఇవ్వడం వల్ల వారికే న్యాయం జరిగిందన్నారు. మేయర్‌ను సమర్థించలేదని, గవర్నమెంట్‌కు స్వాధీనం చేస్తానంటే ఉద్దేశం ఏంటని బాలినేని ప్రశ్నించారు. అవతలివారు కంప్లైంట్ ఇవ్వనప్పుడు గవర్నమెంట్‌కు స్వాధీనం చేస్తానంటే ఎవరినీ సమర్థించలేదు కదా అని అన్నారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ఎల్లో మీడియా రోజుకో కథనాన్ని రాసిందని మండిపడ్డారు. ఒక రోజు రైతుల పొలం కాజేశారని, మరో రోజు మేయర్‌ను బాలినేని తిట్టాడని, ఆమె మొహం చాటేసిందని రాస్తారన్నారు. ఇంకో రోజు 'మేయర్‌ను సమర్థిస్తున్నాడు.. రైతులను ఇబ్బంది పెడుతున్నాడు' అని కథనాలు రాస్తున్నారన్నారు. ఇలా పొంతన లేకుండా ఎల్లో మీడియా రోజుకో రకంగా కథనాలు రాస్తే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఆ పేపర్ల పట్ల ప్రజల్లో విశ్వాసం ఉంటుందా.? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భూ కుంభకోణాలపై 'సిట్' వేయించిన చరిత్ర తనదని అన్నారు. ఎప్పటి నుంచో భూ ఆక్రమణలు జరుగుతున్నాయని, సిట్ వేసిన తర్వాత వందలాది మంది ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తున్న విషయం గమనించాలని అన్నారు. ఎవరు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, వందల కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. సిట్ వేసిన తర్వాత చాలా మంది ఒంగోలు విడిచి పారిపోయారని, అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను శిక్షిస్తారని చెప్పారు. భూ కుంభకోణాలపై ఇంత పారదర్శకంగా విచారణ జరుగుతుంటే ఎల్లో పేపర్లలో రోజుకో రకంగా రాస్తే ప్రజలు ఏం అనుకుంటారు..? ఆ పేపరుకు ప్రజల్లో విశ్వాసం ఉంటుందా.? అని ప్రశ్నించారు. ప్రజలకు మంచి చేస్తుంటే అడ్డుపడటానికి మీడియా ప్రయత్నించడం మంచి పద్ధతి కాదన్నారు.


క్రికెట్ ఏర్పాట్లపైనా విమర్శలా...

ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రజలు పెద్ద స్క్రీన్లపై తిలకించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అన్ని జిల్లాల్లో స్క్రీన్లు ఏర్పాట్లు చేసిందని, వచ్చే క్రికెట్ అభిమానులకు సకల సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో మరిన్ని ఏర్పాట్లు చేశామని బాలినేని తెలిపారు. అసలు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రకటన చేయకముందే తాము ఆలోచన చేశామన్నారు. దీనిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అక్కసు వెళ్లగక్కడం విడ్డూరంగా ఉందన్నారు. క్రీడాభిమానులకు ఆహ్లాదకర వాతావరణంలో మ్యాచ్ లైవ్ చూపించేందుకు మా డబ్బుతో ఏర్పాట్లు చేస్తే తప్పా అని ప్రశ్నించారు. ఒక పేపరు వారి సొమ్ము ఒకడిది.. సోకు ఒకడిది అని రాశారన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని జనార్దన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా కార్యక్రమం చేపడితే తానిచ్చే డబ్బు విషయం ఎవరికీ తెలియదన్నారు. ఎప్పుడైనా డబ్బు పెడితేనే పోస్టర్ వేయించుకుంటానేగానీ.. ప్రభుత్వ డబ్బుతో ఫొటోలు వేయించుకోవడం చేయనన్నారు. టీడీపీ హయాంలో పెట్టిన 'అన్నాక్యాంటీన్'లో జనార్దన్ సొంతంగా పెడుతున్నట్లు పెద్ద ఫొటో వేయించుకున్నాడని, ఆ రోజు తాము ఏమీ మాట్లాడలేదని గుర్తుచేశారు. రిమ్స్ ఆస్పత్రి కట్టించేందుకు తాను కృషి చేశానని, అదే ఆస్పత్రిలో రూ.3 లక్షలు ఖర్చు పెట్టి జనార్దన్ వాళ్ల తాత ఫొటో పెట్టి పచ్చంగా ఆర్వో ప్లాంటు పెట్టి బొమ్మలు వేశారని విమర్శించారు. ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెట్టి కడితే జనార్దన్ మూడు లక్షలు పెట్టి బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. జనార్దన్.. నువ్వా నా గురించి మాట్లాడేదని హెచ్చరించారు. విలేకర్లు సైతం వాస్తవాలు తెలుసుకుని రాయాలని, ఏదైనా ఉంటే తనని అడిగి రాయాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రాయడం సరికాదని బాలినేని స్పష్టం చేశారు. క్రికెట్ ప్రపంచకప్ ఆస్ట్రేలియా గెలిస్తే దీనిపై ఆ పార్టీ నేతలు వితండవాదన చేస్తున్నారని తెలిసిందన్నారు. 'ఎల్లో కలర్ తెలుగుదేశం, బ్లూ కలర్ వైఎస్సార్ సీపీ అని, తెలుగుదేశం గెలిచిందని చెప్పుకుంటూ భారతదేశం ఆడే క్రికెట్‌ను కూడా రాజకీయం చేస్తున్నారంటే ఏ స్థాయికి దిగజారుతున్నారో అర్థం కావట్లేదన్నారు. కనిగిరిలో ఉగ్రనరసింహారెడ్డి పెట్టుకున్నారు.. జనార్దన్ నువ్వు కూడా స్టేడియంలో ఎల్ఈడీ పెట్టుకోవచ్చు కదా అన్నారు. జనసేనకు టికెట్ ఇస్తున్నారనే ఇరిటేషన్‌తో జనార్దన్‌కు మైండ్ పోయిందని ఎద్దేవా చేశారు. పద్ధతిగా రాజకీయం చేయి, నేనూ పద్ధతిగానే రాజకీయం చేస్తానని జనార్దన్‌కు హితవు పలికారు. ప్రజలతో మమేకమై ఓట్లు అడుగు.. అంతేగానీ నామీద బురదజల్లే ప్రయత్నాలు మానుకో అని హెచ్చరించారు. జనార్దన్ పక్కన ఐరన్ లెగ్ ఒకాయన చేరారు, ఆయన జీవితమంతా తాను ఓడిపోవాలని కోరుకుంటాడన్నారు. ఆయన కోరిక నెరవేరదన్నారు. అధికారంలోకి వస్తే తన అంతు చూస్తానని జనార్దన్ చేస్తున్న ప్రకటనలు ఆయన మనస్తత్వానికి నిదర్శనమన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు కాంట్రాక్టర్ల ఇళ్లు పగలకొట్టించాడని, టీడీపీ వారినే ఇబ్బంది పెట్టాడని గుర్తుచేశారు. తాను ఏనాడూ టీడీపీ, జనసేన నేతలను ఇబ్బంది పెట్టానా అని ప్రశ్నించారు. భాగ్యనగర్‌లోని తన సోదరి స్థలం ముందున్న మున్సిపాలిటీ స్థలాన్ని టీడీపీ నేతలు ఆక్రమించారని, దానిని ఖాళీ చేయించడానికి ఎంతో సమయం పట్టిందని, వారి పాపాన వారుపోతారని వదిలివేశానని చెప్పారు. టీడీపీకి చెందిన వార్డైనప్పటికీ రమణి ఆస్పత్రికి అన్ని అనుమతులు ఇప్పించానన్నారు. ఎన్నికల సమయం వరకే పార్టీలని, మిగిలిన సమయాల్లో పార్టీలు చూడకుండా అందరికీ సాయం చేస్తానని బాలినేని వివరించారు.

బ్రాహ్మణులకు మేలు చేయాలనే...

కొంత మంది బ్రాహ్మణులు మేయర్ గంగాడ సుజాతను కలిశారని, స్థలం మాదని, అది మా పేరుతో ఉంటే సమస్య వస్తుందని మీ పేరుపై జీపీఏ చేయించుకోవాలని కోరారని విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు బాలినేని సమాధానమిచ్చారు. మేయర్‌కు రాసిన జీపీఏలో ఎవరికీ విక్రయించే అధికారంలేదని ఉందన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కేసులో ఉన్న ప్రభుదాసుపై చాలా కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడని, దీనికి సంబంధించి ఆధారాలు సేకరిస్తున్నారని చెప్పారు. చెరువుకొమ్ముపాలెం ఎస్సీల గుడిసెల విషయంలో పేదవారికే ఇప్పించానన్నారు. ప్రభుదాసుపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీసు డిపార్టుమెంట్ వారు ఫాలోఅప్ చేస్తున్నారని తెలిపారు. భూ ఆక్రమణల విషయంలో జరుగుతున్న దర్యాప్తు ఆదర్శంగా ఉండాలని ఎస్పీని కోరానన్నారు. ఈ విషయంలో ఇద్దరికీ మంచి పేరు వచ్చేలా ఉండాలని కోరానన్నారు. తాను ఎక్కడా జోక్యం చేసుకోనని స్పష్టం చేశానన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర నాయకుడు కఠారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు పాల్గొన్నారు.

జనగళం



అధునాతన వసతులతో ప్రభుత్వ పాఠశాల



గతంలో మా పాఠశాల చాలా అధ్వానంగా ఉండేది. సరైన భవనాలు లేక, తరగతి గదులు లేక చెట్ల కింద చదువుకునే పరిస్థితి. బాలికలు మరుగుదొడ్లు లేక అవస్థలు పడేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత అమలుచేసిన నాడు–నేడు పథకంతో మా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. మా పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉండగా, ఇరుకు గదుల సమస్య తీరింది. అత్యాధునిక వసతులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దారు. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందిస్తుండటంతో క్రమం తప్పకుండా సంతోషంగా పాఠశాలకు వస్తున్నారు. గతంలో పాఠశాలలో వసతులు లేక పిల్లలు రావాలంటేనే భయపడేవారు. ఇప్పుడు ప్రభుత్వం అన్ని వసతులు కల్పించడంతో బడిమానేసే పిల్లల సంఖ్య చాలా వరకు తగ్గింది. పాఠశాలకు వచ్చే పిల్లల సంఖ్య పెరిగింది. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– **గుర్రపుసాల చంద్రశేఖర్**, హెచ్ఎం, ఎంపీపీ స్కూల్, ప్రగళ్లపాడు గ్రామం, పెద్దారవీడు మండలం

తిరగాల్సిన పని లేకుండానే సర్టిఫికెట్లు ఇచ్చారు



గతంలో ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల కేంద్రానికి 30 కిలోమీటర్లు వెళ్లి రావాల్సి వచ్చేది. అలస్యానికి సరైన సమాధానం ఇచ్చేవారు కాదు. దీంతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసిన తర్వాత గ్రామ వలంటీర్ ద్వారా నాకు, పిల్లలకు అన్ని సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. మా పంచాయతీలోనే కార్యక్రమం నిర్వహించి పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు అందజేశారు.

– **రాయుడునాయక్**, మానేపల్లితండా, పుల్లలచెరువు మండలం

ఇంటి అద్దెల నుంచి విముక్తి కలిగింది



సొంతిల్లు లేకపోవడంతో చాలా కాలంగా అద్దె ఇళ్లలో ఉంటూ వస్తున్నాం. లక్షల రూపాయల అద్దెలు చెల్లించాం. పేద వాళ్లకు సొంతిల్లు అనేది ఓ పెద్ద కల. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఆ కల నెరవేరే పరిస్థితి లేక అలాగే జీవనం సాగిస్తున్నాం. అయితే, ముఖ్యమంత్రి జగనన్న వచ్చిన తర్వాత మా సొంతింటి కల నెరవేరింది. ప్రభుత్వ సాయంతో గుండ్లాపల్లి జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాం. ఇంటి అద్దెల నుంచి విముక్తి కలిగింది. మాలాంటి పేదలకు సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– **షేక్ నాగముస్తాన్‌బీ**, గుండ్లాపల్లి, మద్దిపాడు మండలం

క్లుప్తంగా

భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు

కనిగిరి రూరల్: భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు శిక్ష విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర సోమవారం తీర్పు నిచ్చారు. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాయకొండకు చెందిన బాపట్ల మధుపై అతని భార్య 2017లో పామూరు పోలీస్‌స్టేషన్‌లో వేధింపుల కేసు పెట్టింది. అప్పటి ఎస్సై సాంబయ్య దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడైన బాపట్ల మధుకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

మనోవేదనతో యువకుడు ఆత్మహత్య

గిద్దలూరు రూరల్: మద్యానికి బానిసై తరుచూ కుటుంబ సభ్యులతో ఘర్షణ పడుతూ మనశ్శాంతి కోల్పోయిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గిద్దలూరు పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్టీకాలనీలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. భూపాల్(36) అనే యువకుడు డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తరుచూ కుటుంబ సభ్యులతో ఘర్షణ పడేవాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వల్లూరమ్మ ఆలయానికి రూ.11 లక్షల ఆదాయం

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకులు వేణుగోపాలరావు పర్యవేక్షణలో చీరలు, రవిక గుడ్డలు పోగు చేసుకొనే హక్కుకు సోమవారం టెండర్, బహిరంగ వేలం నిర్వహించారని ఈఓ రమేష్ తెలిపారు. ఈ వేలం ద్వారా ఆలయానికి రూ.11 లక్షల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు, చదలవాడ గ్రూపు టెంపుల్ కార్యనిర్వహణాధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పీడీసీసీబీలో ఐదుగురికి పదోన్నతి


నియామక పత్రాలు అందిస్తున్న పీడీసీసీబీ చైర్మన్

ఒంగోలు సిటీ: ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో మెసెంజర్స్‌గా విధులు నిర్వహిస్తున్న ఐదుగురు స్టాఫ్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందినట్లు పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పదోన్నతి పొందిన వారికి సోమవారం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ జిల్లా సీఈఓ వై.ప్రకాష్, ఏజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

24న మార్కాపురంలో తెప్పోత్సవం


పుష్కరిణిని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ షెహ్వాజ్ అహ్మద్, సీఐ భీమానాయక్

మార్కాపురం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న తెప్పోత్సవానికి దేవదాయశాఖ, పోలీస్, రెవిన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి పుష్కరిణి పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. కోనేటిలో ఉన్న మురుగును బయటకు పంపి చెరువు నీటితో నింపుతున్నారు. సుమారు 50 వేల మందికిపైగా భక్తులు స్వామివారి తెప్పోత్సవానికి హాజరుకానున్న నేపథ్యంలో సోమవారం ట్రైనీ డీఎస్పీ షేక్ షెహ్వాజ్ అహ్మద్, సీఐ భీమానాయక్, ఎస్సై కోటేశ్వరరావు, సువర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. డివిజన్‌లోని పలువురు కానిస్టేబుళ్లు, ఎస్సైలు, సీఐలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉభయదాత శ్రీశైలం దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యురాలు చప్పల్లి కనకదుర్గ, ఈఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కేశవరావు తదితరులు ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

సబ్ రిజిస్ట్రార్ సహా 8 మందిపై కేసులు నమోదు

కనిగిరి రూరల్: కనిగిరి పట్టణంలో ఓ భూమిని నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు, నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యవహారంపై వినుకొండ సబ్‌రిజిస్ట్రార్‌తోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. పట్టణంలోని పామూరు రోడ్డులో సర్వే నంబర్ 311/సీలో గోనుగుంట పవన్‌కుమార్ తదితరులకు 43 సెంట్ల భూమి ఉంది. అందులోని పది సెంట్ల భూమికి జి.నరసింహరావు, బి.శ్రీనివాసరావు, కె.ప్రతాప్ నకిలీ పాస్‌పుస్తకాలు, డాక్యుమెంట్లతో ఒక్కొక్కరు 3 సెంట్ల 33 అంకణాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ అక్రమ తంతుకు మరో నలుగురి సహకారం తీసుకుని.. వినుకొండలో సబ్‌రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి కబ్జాకు యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వినుకొండ సబ్ రిజిస్ట్రార్ హరికృష్ణతోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఈశా.. పరమేశా..


మార్కాపురం : మార్కండేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు వేకువజామునే ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. అభిషేకాల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. - సాక్షి నెట్‌వర్క్


టంగుటూరు : జమ్ములపాలెం శివాలయంలో 1116 శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు


ఒంగోలు : కొత్తపట్నం బస్టాండ్ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శోభ


దర్శిలో కాశీ విశ్వనాథస్వామి దర్శనానికి క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు


జమ్ములపాలెంలో పంచముఖేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

టైరు పేలి కారు బోల్తా


ఘటనా స్థలంలో బోల్తాపడిన కారు, పక్కన క్షతగాత్రులు


మృతిచెందిన సావిత్రీబాయి


జిల్లా వైద్యశాలలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ట్రైనీ డీఎస్పీ షెహ్వాజ్ అహ్మద్

- ఒకరు మృతి, 12 మందికి గాయాలు
- దైవదర్శనానికి వెళ్తుండగా ఘటన
- బాధితులది మహారాష్ట్రలోని సోలాపూర్

మార్కాపురం రూరల్: కారు టైర్ పేలి అదుపుతప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఏడుగురికి తీవ్ర, ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సాయంత్రం మార్కాపురం మండలంలోని కోమటికుంట–చింతకుంట్ల మధ్య చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన 13 మంది పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు కారులో బయలుదేరారు. సోమవారం ఉదయం శ్రీశైలంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రాయచోటికి వెళ్తుండగా మార్గమధ్యంలో జాతీయ రహదారిపై కోమటికుంట–చింతగుంట్ల మధ్య టైర్ పేలిపోయి కారు బోల్తాపడింది. క్షతగాత్రులను 108, 1033 అంబులెన్స్ వాహనాల్లో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సావిత్రీబాయి(40) అనే మహిళ మృతిచెందింది. మృతురాలిది సోలాపూర్‌లోని మల్లిఖార్జుననగర్‌గా తెలిసింది. తుఫాన్ బోల్తాపడిన సమయంలో అటుగా వెళ్తున్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్షతగాత్రులను వైద్యశాలకు తరలించేందుకు సహాయం అందించారు.

క్షతగాత్రులను పరామర్శించిన ట్రైనీ డీఎస్పీ

రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ట్రైనీ డీఎస్పీ షెహ్వాజ్ అహ్మద్, సీఐ భీమానాయక్, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

అంకితభావంతో సమస్యలు పరిష్కరించాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- స్పందన కార్యక్రమంలో అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు, ఉద్యోగులను హెచ్చరించారు. ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా పనిచేయాలన్నారు. అర్జీలు మొక్కుబడిగా కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఒకసారి వచ్చిన సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా పరిష్కరిస్తేనే సక్రమంగా పనిచేసినట్లు అవుతుందన్నారు. అర్జీల పరిష్కారంలో సహేతుకత ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


స్పందనలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కొమరోలు, కంభం, ఒంగోలుకు చెందిన ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు స్పందనలో అధికారులను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీ అందజేశారు. 2008 నుంచి పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు సర్వీసు అంశాలతో పాటు జీతం, పెన్షన్, ఇతర బెనిఫిట్స్‌కు సంబంధించి పలు ఇబ్బందులు ఉన్నాయని, వాటిని పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.
- సింగరాయకొండ మండలం కలికవాయికి చెందిన పలువురు స్పందనలో అధికారులను కలిసి గ్రామ సమీపంలో సీడ్స్, ఫీడ్స్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, వాటి వలన తమ గ్రామంలో వాతావరణం కాలుష్యంగా మారి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఫిర్యాదు చేశారు. వాతావరణమే కాకుండా నీరు, మట్టి కూడా కలుషితమైన పంటలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.

టీడీపీ నాయకుల ఓవరాక్షన్


వైఎస్సార్ సీపీ నాయకులతో వాగ్వివాదానికి దిగిన టీడీపీ నేత

కంభం: వైఎస్సార్ సీపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు అడుగడుగునా ఆటంకాలు కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల 16వ తేదీన కంభం–3 సచివాలయం పరిధిలోని తెలుగు వీధిలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించేందుకు దిమ్మె, జెండా ఏర్పాటు చేశారు. అయితే తమ ప్రాంతంలో ఎందుకు ఏర్పాటు చేసారంటూ టీడీపీ నాయకులు దిమ్మెను పగలగొట్టి, జెండా పైపును తొలగించి పక్కనే పడేశారు. ప్రశ్నించిన వారిపై మూకుమ్మడిగా వాగ్వివాదానికి దిగారు. సోమవారం కంభం–1 సచివాలయం పరిధిలో డ్రైనేజీని ఆనుకొని పంచాయతీ స్థలంలో జెండా ఏర్పాటు చేసి సాయంత్రం ఆవిష్కరించేదుకు వెళ్లగా తమ ఇళ్ల సమీపంలో జెండా ఎందుకు పెడుతున్నారంటూ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో టీడీపీ నాయకులు మరోమారు వాగ్వివిదానికి దిగారు. జెండా ఏర్పాటు చేసింది పంచాయతీ స్థలంలో అయితే రోడ్డుకు అవతల ఉన్న టీడీపీ నాయకుడు తమ ఇంటి ముందు ఎలా జెండా పెడతారని ప్రశ్నించడంలో ఆంతర్యం ఏమిటని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వినియోగదారుల సేవకే విద్యుత్ అదాలత్

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేలు


విద్యుత్ అదాలత్‌లో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

పొదిలిరూరల్(కొనకనమిట్ల): విద్యుత్ వినియోగదారులకు ఎదురయ్యే సేవా లోపాలను సత్వరమే పరిష్కరించేందుకు కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) సిద్ధంగా ఉందని ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఎస్. విక్టర్ ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. సోమవారం కొనకనమిట్లలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయం ప్రాంగణంలో విద్యుత్ ఆదాలత్, అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీఆర్ఎఫ్ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యుత్ సేవలు నిర్ణీత కాల పరిమితిలోగా అందించకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. వినియోగదారులు ఫోరం దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సేవ అమలులో జాప్యానికి పరిహార రుసుం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదాలత్‌కు 24 ఫిర్యాదులు రాగా వాటిలో 21 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన 3 సమస్యలు కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు, లైన్ తొలగింపులపై వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, దర్శి డీఈ ఎస్.అబ్దుల్ కరీం, ఎ.సునీత, వెంకట కృష్ణ, ఏడీఏ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 35 కుటుంబాలు

- ముస్లిం మైనార్టీలకు ఆహ్వానం పలికిన ఎమ్మెల్యే కేపీ


పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, మార్కాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీకి చెందిన వారు వైఎస్సార్ సీపీలోకి క్యూకడుతున్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని కొండారెడ్డి కాలనీ కౌసర్ మసీదు, ముత్తువలి వర్గానికి చెందిన సుమారు 35 కుటుంబాలు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కేపీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముత్తువలి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పనితీరు చూసి పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి, 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలు పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు షేక్షావలి, మైనార్టీ నేత కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- 52 మందికి రూ.63 లక్షలు అందజేసిన బాలినేని

ఒంగోలు సిటీ: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తన నివాసంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. 52 మంది లబ్ధిదారులకు రూ.63 లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు కూడా చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చెక్కులు తీసుకున్న వారు బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కఠారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, సాంస్కృతిక విభాగం మూడు జిల్లాల కన్వీనర్ బొట్ల సుబ్బారావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు, ఉన్నం జనార్దన్, పటాపంజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న బాలినేని, పక్కన మేయర్

మున్సిపల్ వాటర్ పైప్‌లైన్‌కు శంకుస్థాపన

ఒంగోలు సిటీ: నగరంలోని 18వ డివిజన్ వెంగముక్కలపాలెంలో సుర్జ లేఔట్స్‌లో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో మున్సిపల్ వాటర్ పైప్‌లైన్‌కు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. 18వ డివిజన్‌లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.70 లక్షల అంచనా వ్యయంతో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ.. తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు అందించిన బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ పద్మజ, ఎంఈ జానీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 137 ఫిర్యాదులు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 137 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు ఎస్పీని నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. సమస్య పూర్వాపరాలను తెలుసుకున్న ఎస్పీ ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడారు. బాధితులకు సాధ్యమైనంత త్వరగా న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్) ఎస్‌వీ శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మెరియదాసు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, ఐసీసీఆర్ సీఐ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనను ఉపయోగించుకోండి

- బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలు సిటీ: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు అర్హులైన చేతివృత్తుల వారు కామన్ సర్వీస్ సెంటర్ లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విశ్వకర్మ పథకం గురించి వివరించారు. కుల వృత్తులను బలోపేతం చేయడమే పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. వడ్రంగి, స్వర్ణకారులు, శిల్పాలు, విగ్రహాలు, బుట్టలు, చాపలు, మట్టి పాత్రలు, చీపుర్లు తయారు చేసే వారు, దోభీ, టైలర్, చేప వలలు తయారు చేసేవారు, చెప్పులు కుట్టేవారు, తాపీ కార్మికులు, క్షురకులు, సంప్రదాయ బొమ్మలు, పూలదండలు, పడవల తయారీదారులు, ఇంటి తాళాలు తయారు చేసేవారు పథకానికి అర్హులని తెలిపారు. దరఖాస్తుదారులు 18 ఏళ్లు నిండి ఉండాలని, గతంలో ఎటువంటి రుణం తీసుకుని ఉండకూడదన్నారు. ఎంపిక మూడు దశల్లో ఉంటుందని, ఎంపికైన వారికి శిక్షణతో పాటు ఉపకారవేతనంగా రూ.500 చెల్లిస్తారని తెలిపారు. కులవృత్తుల వారికి పనిముట్లు కొనుగోలు చేసేందుకు రూ.15 వేలు ఇస్తారని చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అర్హత ఉన్న బీసీ కులాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 79890 25256, 83098 81944ను సంప్రదించాలని సూచించారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
21-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
140	38
65,655	19,694

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,246	▲	121
డోజోన్స్	35,072	▲	125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,496	▽	8
డాక్స్	15,901	▽	18
షాంఘై	3,068	▲	14
నికాయ్	33,388	▽	197

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,888
బంగారం (99.5 స్వచ్ఛత)	60,644
వెండి (కేజీ)	72,561

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.52	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.38	105.73
€	యూరో	ఎస్‌బీఐ	89.52	92.61
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.11	56.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.39	55.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.89	64.58
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.51	12.58

నష్టాలొస్తున్నా ఫ్యూచర్స్ ట్రేడింగ్

ఇన్వెస్టర్ల తీరుపై సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి ఆశ్చర్యం



బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఇన్వెస్టర్ రిస్క్ రిడక్షన్ యాక్సెస్ (ఐఆర్ఆర్ఏ) ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభిస్తున్న బీఎస్ఈ చైర్‌పర్సన్ ఎస్ఎస్ ముంద్రా, ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తితో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్

ముంబై: ఫ్యూచర్స్, ఆప్షన్స్ విభాగంలో 90 శాతం మంది నష్టపోతున్నా.. ఇన్వెస్టర్లు మాత్రం డెరివేటివ్స్‌నే ఇష్టపడుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ వ్యాఖ్యానించారు. ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక దృష్టితో మదుపు చేయాలని, తద్వారా ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులు అందుకోవడానికి అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. బీఎస్ఈలో ఇన్వెస్టర్ రిస్క్ రిడక్షన్ యాక్సెస్ (ఐఆర్ఆర్ఏ) ప్లాట్‌ఫాంను ఆవిష్కరించిన సందర్భంగా బుచ్ ఈ విషయాలు తెలిపారు. సెబీ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో ఎఫ్అండ్ఓ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసిన 45.24 లక్షల మందిలో కేవలం 11 శాతం మంది మాత్రమే లాభాలు ఆర్జించినట్లు వెల్లడైందని ఆమె చెప్పారు. పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండవని తెలిసీ చాలా మంది ఇన్వెస్టర్లు డెరివేటివ్స్‌పై బెట్టింగ్ చేస్తుండటమనేది తనకు కాస్త గందరగోళ వ్యవహారంగా అనిపిస్తుందని బుచ్ చెప్పారు. ప్రతిరోజూ ఎఫ్అండ్ఓ సెగ్మెంట్‌లో డబ్బులు పోగొట్టుకోవడం కన్నా పెట్టుబడుల విషయంలో దీర్ఘకాలికమైన, నిలకడైన వ్యూహాన్ని పాటించడం శ్రేయస్కరమని, తద్వారా సంపదను సృష్టించుకోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆమె వివరించారు.

ఐఆర్ఆర్ఏతో పొజిషన్ల స్క్వేర్ ఆఫ్..

బ్రోకరేజీ సిస్టమ్‌లో అంతరాయం ఏర్పడ్డ పక్షంలో ట్రేడరు తమ ఓపెన్ పొజిషన్లను స్క్వేర్ ఆఫ్ చేసుకునేందుకు ఐఆర్ఆర్ఏ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుంది. పరిశ్రమ వర్గాల ప్రకారం బ్రోకరేజ్ సిస్టమ్ పనిచేయకపోతే ఐఆర్ఆర్ఏని డౌన్‌లోడ్ చేసుకునేందుకు ట్రేడర్‌కి ఎస్ఎంఎస్ వస్తుంది. దాన్ని ఉపయోగించుకుని రెండు గంటల వ్యవధిలోగా ట్రేడరు తమ ఓపెన్ పొజిషన్స్‌ను స్క్వేర్ ఆఫ్ చేసుకోవచ్చు.

రూపాయి రికార్డ్ కనిష్టం



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
21-11-2023	
విశాఖ	535-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
20-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ చరిత్రాత్మక కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో డాలరుతో మారకంలో 12 పైసలు కోల్పోయి 83.38 వద్ద ముగిసింది. ఇది సరికొత్త కనిష్టంకాగా.. ఇంతక్రితం ఈ నెల 13న 83.33 వద్ద నిలవడం ద్వారా లైఫ్‌టైమ్ కనిష్టానికి చేరింది. కాగా.. వారాంతాన రూపాయి 83.26 వద్ద నిలవగా.. తాజాగా 83.25 వద్ద స్థిరంగా ప్రారంభమైంది. ఆపై బలహీనపడుతూ చివరికి 83.38కు చేరింది. అయితే ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు 0.4 శాతం నీరసించి 103.48 వద్ద కదులుతున్నప్పటికీ ముడిచమురు బలపడటం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు ప్రభావం చూపినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.75 శాతం పెరిగి 81.21 డాలర్లకు చేరింది. ఇక మరోవైపు ఈ నెల 10కల్లా దేశీ విదేశీ మారక నిల్వలు 46.2 కోట్ల డాలర్లు తగ్గి 590.32 బిలియన్ డాలర్లకు చేరాయి.

రెండో రోజూ మార్కెట్ డీలా

సెన్సెక్స్ 140 పాయింట్లు డౌన్ • 65,655 వద్ద ముగింపు • నిఫ్టీ 38 పాయింట్లు మైనస్

వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. విదేశీ **పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) నిరంతర అమ్మకాలు** ప్రభావం చూపాయి. **ఆటో, యుటిలిటీ, కమోడిటీ షేర్లు అమ్మకాల** ఒత్తిడికి లోనయ్యాయి. వెరసి సెన్సెక్స్ 140 పాయింట్లు క్షీణించి 65,655 వద్ద ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్ల నష్టంతో 19,694 వద్ద స్థిరపడింది. **ఆద్యంతం హెచ్చుతగ్గుల మధ్య కదిలిన మార్కెట్లు** చివరికి **అమ్మకాలదే పైచేయి కావడంతో వెనకడుగు** వేశాయి. **వెరసి సెన్సెక్స్ 65,844 పాయింట్ల** వద్ద గరిష్టాన్ని **తాకగా.. 65,548 స్థాయిలో** కనిష్టాన్నీ చవిచూసింది. ఇది 247 పాయింట్ల నష్టం కాగా.. **ఇంట్రాడేలో** నిఫ్టీ సైతం 19,756–19,670 పాయింట్ల మధ్య **ఊగిసలాడింది.** దీర్ఘకాలంగా **బలపడుతున్న** వడ్డీ రేట్లు, **ప్రపంచ ఆర్థిక** మందగమనంపై **ఆందోళనలు** అమ్మకాలకు దారి చూపుతున్నట్లు మార్కెట్ **విశ్లేషకులు** అభిప్రాయపడ్డారు.



ఐటీ ప్లస్‌లో

ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఆటో, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ. రియల్టీ రంగాలు 0.8–0.3 శాతం మధ్య డీలా పడగా.. ఐటీ 0.6 శాతం పుంజుకుంది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం, ఎస్‌బీఐ లైఫ్, అల్ట్రాటెక్, బజాజ్ ఫిన్, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, యూపీఎల్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ 2.6–1 శాతం మధ్య నష్టపోయాయి. ఇతర బ్లూచిప్స్‌లో దివీస్, ఎయిర్‌టెల్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, టెక్‌మహీంద్రా 2–0.7 శాతం మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్లు ఓకే

బీఎస్ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ యథాతథంగా నిలిస్తే.. స్మాల్ క్యాప్ 0.4 శాతం బలపడింది. ట్రేడైన షేర్లలో 1,997 నీరసించగా.. 1,840 పుంజుకున్నాయి. నగదు విభాగంలో వారాంతాన రూ. 478 కోట్ల విలువైన షేర్లు విక్రయించిన ఎఫ్‌పీఐలు తాజాగా మరో రూ. 646 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే దేశీ ఫండ్స్(డీఐఐలు) స్వల్పంగా రూ. 78 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేయడం గమనార్హం!

కెనరా బ్యాంక్ నుంచి కొత్త ఉత్పత్తులు

118వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రారంభం



ఎండీ, సీఈవో
కె. సత్యనారాయణ రాజు

హైదరాబాద్: ప్రభుత్వరంగ కెనరా బ్యాంక్ 118వ వ్యవస్థాపక **దినో**త్సవం సందర్భంగా పలు కొత్త **ఉత్పత్తు**లను కస్టమర్లకు **అందుబా**టులోకి తీసుకొచ్చింది. కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో కె. సత్యనారాయణ **రాజుతోపాటు** బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఈ ఉత్పత్తులను **ఆవిష్కరించారు.** కార్పొరేట్ కస్టమర్ల **కోసం ప్రత్యేకంగా** 'కార్పొరేట్ ఏబీ1' అనే సేవను ప్రారంభించింది. ఇందులో **భాగంగా ఇంటర్నెట్ బ్యాంకిం**గ్‌తోపాటు, ప్రత్యేకంగా 'కెనరా ఏబీ1 కార్పొరేట్' అనే **యాప్ ద్వారా లావాదేవీలు నిర్వహిం**చుకోవచ్చు. అలాగే, 18 రకాల సేవలను వాట్సాప్ **బ్యాంకింగ్ చానల్ ద్వారా అందిస్తున్న**ట్లు ప్రకటించింది. కస్టమర్లు 9076030001 అనే **వాట్సాప్ నంబర్‌కు హాయ్/హెలో అని** మెస్సేజ్ పంపడం ద్వారా, కావాల్సిన సేవను పొం**దొచ్చు**. అలాగే, కెనరా యూపీఐ 123 పే పేరుతో ఫీచర్ **ఫోన్లను** వినియోగిస్తున్న వారి కోసం ఐవీఆర్ ఆధారిత **యూపీ**ఐ సేవను సైతం కెనరా బ్యాంక్ తీసుకొచ్చింది. ఏ **బ్యాంక్** ఖాతాదారులు అయినా 'కెనరా యూపీఐ 123 పే' **సేవల**ను వినియోగించుకోవచ్చని ప్రకటించింది.



పోస్టాఫీసుల్లో బ్లూడార్ట్ డిజిటల్ లాకర్ సేవలు





న్యూఢిల్లీ: భారతీయ తపాలా శాఖతో బ్లూడార్ట్ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన తపాలా కార్యాలయాల్లో బ్లూడార్ట్ డిజిటల్ లాకర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనివల్ల పార్సిల్ పొందాల్సిన వ్యక్తి రోజులో 24 గంటల్లో ఎప్పుడైనా డిజిటల్ లాకర్ వద్దకు వెళ్లి తీసుకోవడానికి అవకాశం ఉంటుందని బ్లూడార్ట్ ప్రకటించింది. ఎలాంటి సంతకాలతో పనిలేదని పేర్కొంది. పోస్టాఫీస్‌తో వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో ఆటోమేటెడ్ డిజిటల్ పార్సిల్ లాకర్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. లాకర్లలో పార్సిల్స్ సురక్షితంగా ఉంటాయని, తమకు కేటాయించిన కోడ్‌ను నమోదు చేయడం ద్వారా సులభంగా ప్యాకేజీను పొందొచ్చని వివరించింది. కేవలం గుర్తింపు ఉన్న వ్యక్తే వీటిని పొందగలరని తెలిపింది. కస్టమర్లు తమ వీలు ప్రకారం ప్యాకేజీలను పొందే అవకాశం కల్పించడమే ఇందులోని ఉద్దేశంగా బ్లూడార్ట్ ఎండీ బాల్‌ఫోర్ మాన్యుయేల్ ప్రకటించారు.

వృద్ధి స్పీడ్‌కు 'ఎన్నికల' అడ్డంకి

- 2024 ఎకానమీ అంచనా తగ్గించిన గోల్డ్‌మన్ శాక్స్
- 6.4 శాతం నుంచి 6.3 శాతానికి..



ముంబై: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2024 వృద్ధి అంచనాలను అమెరికన్ బ్రోకరేజ్ సంస్థ 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 2023లో తొలి 6.4 శాతం అంచనాలను తాజాగా 6.3 శాతానికి తగ్గిస్తున్నట్లు తాజా నివేదికలో పేర్కొంది. ఎన్నికల సంవత్సరం అనిశ్చితి నెలకొనే అవకాశం తన తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి నమోదవుతుందని సంస్థ అంచనావేసింది. ఇక 2024లో వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉంటుందన్నది శాక్స్ అంచనా. 2023లో ఈ అంచనా 5.7 శాతంగా పేర్కొంది. 2025 తొలి నెలల్లోపు ఆర్‌బీఐ రెపో రేటు ప్రస్తుత 6.5 శాతం నుంచి అరశాతం తగ్గుతుందన్నది గోల్డ్‌మన్ శాక్స్ అంచనా. డాలర్ మారకంలో రూపాయి విలువ 2023లో సగటును 83గా ఉంటే, 2024లో 82కు బలపడుతుందని శాక్స్ నివేదిక పేర్కొంది.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



తిరుపతి జిల్లా గూడూరులో సంక్షేమ పథకాల వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు



కృష్ణా జిల్లా పామర్రులో అభివృద్ధి పనులకు సంబంధించిన బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



అంబేడ్కర్ కోనసీమ జిల్లా భట్నవిల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు



వైఎస్సార్ జిల్లా పైడికాలువలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి



పశ్చిమగోదావరి జిల్లా ప్రాతాళ్లమెరకలో సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నరసింహరాజు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో

భారీ అగ్ని ప్రమాదం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
- బాధితులను ఉదారంగా ఆదుకోవాలని.. అధికారులకు ఆదేశం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం షిప్పింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఓ బోటులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 45 బోట్లు కాలిపోయాయి. ఉద్దేశ్యపూర్వకంగానే కొందరు మద్యం మత్తులో ఈ బోట్లకు నిప్పు పెట్టినట్టు పోలీసులు ప్రాథమికంగా అనుమానించినప్పటికీ అది నిర్ధారణ కాలేదు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత మత్స్యకారులను ఆదుకునే విషయంలో ఆయన చాలా ఉదారంగా స్పందించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80 శాతం మేర పరిహారంగా అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అలాగే, ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి కారణాలు వెలికితీయాలన్నారు.

ప్రమాదవశాత్తూ దుర్ఘటన..

తొలుత.. ఆదివారం అర్ధరాత్రి కొంతమందితో కలిసి ఓ యూట్యూబర్ హార్బర్‌లోని జీరో నెంబర్ జెట్టీలో లంగరు వేసి ఉన్న బోటులో మందు పార్టీ చేసుకున్నాడని, వారిలో వారికి గొడవ మొదలై నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అనుమానించారు. అలాగే, యూట్యూబర్‌కు చెందిన బోటును మరొకరికి అమ్మారని, కొనుగోలు చేసిన వ్యక్తి ఆ సొమ్మును సకాలంలో ఇవ్వకపోవడంతో బోటును తగులబెడ్తానని కొన్నాళ్లుగా హెచ్చరిస్తున్నాడని, అలా ఆదివారం అర్ధరాత్రి అన్నంత పనీ చేశాడన్న ప్రచారం కూడా జరిగింది. సంఘటన స్థలంలో ఉండి తగలబడిపోతున్న బోట్లను తన సెల్‌ఫోన్లో యూట్యూబర్ చిత్రీకరించి తన యూట్యూబ్‌లో ఉంచడం కూడా ఈ అనుమానాలకు బలం చేకూరింది. దీంతో పోలీసులు ఆ యూట్యూబర్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో అది నిర్ధారణ కాకపోవడంతో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం సంభవించిందని పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు.. ఈ జెట్టీలో 10 రోజుల క్రితం వరకు సీసీ కెమేరాలు ఉండేవి. కానీ, హార్బర్ ఆధునీకరణ పనుల కారణంగా వీటిని తొలగించారు. దీంతో ఘటనపై దర్యాప్తునకు ప్రతిబంధకంగా మారింది.

45 మెకనైజ్డ్ బోట్లు అగ్నికి ఆహుతి..

ఈ ప్రమాదంలో మొత్తం 45 మెకనైజ్డ్ బోట్లు దగ్ధమైనట్లు అధికారులు గుర్తించారు. వీటిలో 36 బోట్లు పూర్తిగానూ, తొమ్మిది బోట్లు పాక్షికంగానూ దగ్ధమయ్యాయి. కొన్ని బోట్లు పూర్తిగా నీటిలో మునిగిపోగా మరికొన్ని వాటి ఆనవాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇక సోమవారం తెల్లవారుజామున వేటకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న బోట్లు, వేటకు వెళ్లి హార్బర్‌కు వచ్చిన బోట్లు కూడా ప్రమాదానికి గురయ్యాయి. ఈ బోట్లలో ఉన్న వేల లీటర్ల డీజిల్, టన్నుల కొద్దీ వేటాడి తెచ్చిన చేపలు, రొయ్యలు అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కో బోటు విలువ దాని స్థితిని బట్టి రూ.25 నుంచి 60 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ లెక్కన అగ్నిప్రమాదంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్టు భావిస్తున్నారు.

అప్రమత్తమైన యంత్రాంగం

ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే విశాఖ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అందుబాటులో ఉన్న అగ్నిమాపక శకటాలను హుటాహుటిన ఘటనా స్థలానికి తరలించింది. అగ్నిమాపక శాఖ శకటాలతో పాటు విశాఖ పోర్టు అథారిటీ, కోస్టుగార్డు, నేవీలకు చెందిన అత్యాధునిక ఫైర్ ఫైటింగ్ వాహనాలను రంగంలోకి దించారు. సుదీర్ఘ శ్రమ అనంతరం ఎట్టకేలకు సోమవారం వేకువజామున మంటలను అదుపు చేయగలిగారు. మంటలు ఇతర బోట్లకు వ్యాపించకుండా విజయవంతంగా కట్టడి చేశారు.

తప్పిన పెనుముప్పు..

హార్బర్‌లో అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతానికి కొద్దిమీటర్ల దూరంలోనే హిందుస్తాన్ పెట్రోలియంకు చెందిన డీజిల్ బంకరింగ్ ఇన్‌స్టాలేషన్ ఉంది. అక్కడ 365 కిలోలీటర్ల డీజిల్ నిల్వలున్నాయి. అలాగే, హార్బర్ సమీపంలోనే విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీసీటీపీఎల్) కూడా ఉంది. అక్కడ ఇతర దేశాలకు ఎగుమతి చేసే సరుకూ సిద్ధంగా ఉంది. దీంతో ఏదైనా పేలుడు సంభవించి ఆ శకలాలు వచ్చి పడితే ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. అయితే, అలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు.. పోలీసు, అగ్నిమాపక శాఖ, మత్స్యశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు రాత్రంతా ప్రమాద స్థలంలోనే ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ

ఘటనా స్థలిని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, కలెక్టర్ ఎ. మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ. రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌లు ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని ప్రమాదం తీరుతెన్నులను పరిశీలించారు. బోటు యజమానులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మరోవైపు.. టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు హార్బర్‌ను సందర్శించారు.

నష్టం తేలగానే పరిహారం: మంత్రి అప్పలరాజు

ఇక ఈ ప్రమాదంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ఉదారంగా స్పందించారని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఈ ఘటనలో బోట్లు కాలిపోయిన యజమానులకు వాటిల్లిన నష్టంలో 80 శాతం పరిహారంగా ఇవ్వాలని ఆదేశించారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో సోమవారం మధ్యాహ్నం మంత్రి ఘటనాస్థలిని సందర్శించారు. కాలిపోయిన, మునిగిపోయిన బోట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ దుర్ఘటన దురదృష్టకరమన్నారు. దగ్ధమైన బోట్ల విలువ నష్టాన్ని అంచనా వేశాక ఆ మొత్తంలో 80 శాతం ప్రభుత్వం తక్షణమే పరిహారంగా చెల్లిస్తుందన్నారు. గతంలో హుద్‌హుద్, తిత్లీ తుపానుల సమయంలోనూ ఈ హార్బర్‌లో బోట్లు దెబ్బతిన్నాయని.. కానీ, అప్పటి ప్రభుత్వం వీరికి నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా అమలుచేయలేదని ఆయన గుర్తుచేశారు. అందువల్లే ప్రభుత్వ పరిహారంపై నమ్మకంలేక మత్స్యకారుల్లో ఆందోళన నెలకొందన్నారు. కానీ, సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీని కచ్చితంగా అమలుచేస్తారని అప్పలరాజు స్పష్టంచేశారు. మంటలను అదుపుచేయడంలో విశాఖ పోర్టు, సీఐఎస్ఎఫ్, నేవీ తదితర సంస్థలు ఎంతో కృషి చేశాయని కొనియాడారు. త్వరలోనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టంచేశారు.

బాధిత మత్స్యకారులపట్ల

సీఎం జగన్ ఉదారత

బోట్ల విలువలో 80 శాతం పరిహారం ఇవ్వండి

మానవతా దృక్పథంతో సాయం చేయండి	
	బోట్లకు బీమా లేదనో లేదా వేరే ఇతర సాంకేతిక కారణాలు చెప్పకండి
	భవిష్యత్తులో బోట్లకు బీమా చేయించుకునేలా తోడ్పాటునివ్వండి
	ఇలాంటి కష్టకాలంలోనే వారికి మనం భరోసా కల్పించాలి

సాక్షి, అమరావతి: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం కారణంగా బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు కనీవినీ ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయం ప్రకటించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80 శాతం మేర పరిహారంగా అందించాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఘటనా స్థలానికి వెళ్లాలని కూడా సూచించారు. ఈ దుర్ఘటనపై సోమవారం ఉదయం సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి సీదిరి అప్పలరాజు సహా జిల్లా కలెక్టర్ ఘటనా స్థలానికి వెళ్లారని.. బాధితులకు పూర్తి భరోసానిచ్చామని వారు చెప్పారు. ప్రమాదంలో 36 బోట్లు దగ్ధం కాగా, మరో 9 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ప్రమాదంలో బోట్లు దగ్ధంకావడం మత్స్యకారుల జీవితాలకే పెద్దదెబ్బ అని.. ఇలాంటి పరిస్థితుల్లో వారి జీవితాలను నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సాయం విషయంలో అత్యంత మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. మానవత్వం అనే పదానికి అర్థం చెబుతూ.. మత్స్యకారుల జీవితాలను తిరిగి నిలబెట్టేలా ఈ సాయం ఉండాలన్నారు. అందుకే ఈ విషయంలో ఉదారంగా ఉండాలని ఆదేశించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80శాతం మేర పరిహారంగా ఇవ్వాలని, వారు తిరిగి తమ జీవితాలను నిలబెట్టుకునేలా అండగా ఉండాలన్నారు. బోట్లకు బీమా లేదనో, లేక వేరే ఇతర సాంకేతిక కారణాలను చూపి బాధితుల జీవితాలను గాలికి వదిలేయడం సరికాదన్నారు. ఇలాంటి కష్టం కాలంలోనే వారికి పూర్తి భరోసా కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని సీఎం జగన్ అధికారులకు స్పష్టంచేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాద సమయాల్లో ఇబ్బందిలేకుండా బోట్లకు బీమా చేయించుకునేలా అధికారులు తోడ్పాటు అందించాలన్నారు.

రూ.12కోట్ల మేర నష్టం!

ఇక ప్రాథమిక అంచనా ప్రకారం.. బోట్ల దగ్ధం కారణంగా దాదాపు రూ.12 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లుగా భావిస్తున్నారని, అధికారులు తుది నివేదిక సిద్ధంచేస్తున్నారని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు